క్లుప్తంగా

దేవరగట్టులో కార్తీక మాస పూజలు


ప్రత్యేక అలంకరణలో మాళ మల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టులో కార్తీక మాసం ఆదివారం సందర్భంగా మాళమల్లేశ్వరస్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకలు, భండారార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, ఆకుపూజ, నివేదన, నీరాజనం తదితర పూజలు జరిపించి నైవేద్యం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే సంతాన లక్ష్మిగా వెలుగొందుతున్న మాత మాళమ్మను భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా క్రిష్ణానంద స్వామి ఆరాధన


పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో ఆదివారం క్రిష్ణానందస్వామి 8వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి సమాధికి నిర్వాహకులు రూపామోహన్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగ పూజ, గాయత్రీ హోమం, మంగళహారతులు, భజన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామి సమాధిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, శంకరబండ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం


అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఆలూరు రూరల్: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ ఆదివారం సాయంత్రం తెలిపారు. హొళగుంద మండలం నెరణికి తండాకు చెందిన టక్రా నాయక్ స్థానిక ఫైర్ ఆఫీసు సమీపంలో 20 లీటర్లు నాటుసారాను విక్రయించడానికి తీసుకొస్తుండగా పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

అన్నదమ్ముల్లా మెలగండి


బొందిమడుగులలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణమూర్తి

తుగ్గలి : చిన్న విషయాలకు ఘర్షణలకు పాల్పడకుండా..కలిసిమెలసి జీవించాలని తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి సూచించారు. ఆదివారం మండలంలోని బొందిమడుగులలో ఆదివారం రాత్రి ఎస్ఐ పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. చిన్నచిన్న విషయాలకు గొడవలు పడకుండా పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. యువత చెడువ్యసనాల జోలికి పోకుండా చదువులపై దృష్టి పెట్టాలన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పిడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా శేషు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంఘంలో వెల్దుర్తికి చెందిన పలువురు ఆర్యవైశ్యులకు కీలక పదవులు దక్కాయి. అనంతపురంలో ఆదివారం సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారత్సం జరిగింది. ఇందులో ఏపీ ఆర్యవైశ్య సంఘం జనరల్ సెక్రటరీగా అత్తులూరి కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా వేముల శేషు, జిల్లా సెక్రటరీగా చాటకొండ కార్తీక ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ఎన్నికపై మండల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్యం లోపించనీయొద్దు

హొళగుంద: నిత్యం ప్రజల రద్దీ ఉండే ప్రాంతాల్లో చెత్త చెదారం వేయరాదని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. ఆదివారం స్థానిక తేరుబజారులో పారిశుద్ధ్య పనులు చేయించారు. తేరు బజారులో ఇష్టానుసారంగా చెత్త వేస్తుండటంతో అపరిశుభ్రంగా మారింది. దీంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్యం లోపిస్తే వ్యాధులు ప్రబలుతాయన్నారు. చెత్త వేయకుండా స్థానికులు సహకరించాలని కోరారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఆరోగ్య భరోసా

- 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచిత ఆరోగ్య బీమా వర్తింపు
- ఏడాదికి రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం
- ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అమలు
- నియోజకవర్గంలో 28 వేల మంది వృద్ధులకు లబ్ధి
- ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం
- సద్వినియోగం చేసుకోవాలంటున్న వైద్యులు



ఆయుష్మాన్ భారత్ కింద జారీ చేసిన కార్డు

ఆలూరు రూరల్: ఆసుపత్రుల పాలైతే కూడబెట్టుకున్నదంతా కరిగి పోవాల్సిందే. ఖరీదైన వైద్యం కారణంగా అప్పుల పాలైన కుటుంబాలు ఎన్నో. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే ముందస్తు ఆరోగ్య బీమానే మార్గం. వృద్ధాప్య సమయంలో ఆరోగ్య బీమా ప్రీమియం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో 70 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద ఉచితంగా ఆరోగ్య బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇప్పటి వరకు ఈ పథకం కింద పేద, తక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతోంది. ఇకపై ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులు పీఎంజేఏవై కింద రూ.5 లక్షల నగదు రహిత హెల్త్ కవరేజీ లభిస్తుంది.

70 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచిత బీమా..

పీఎంజేఏవై పథకాన్ని 2018లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. పేద తరగతి కుటుంబాలకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు అందుతున్నాయి. తాజాగా..

- 70 ఏళ్లు పైబడి.. ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుబాటులో తెచ్చింది.
- అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుంది.
- చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారు.
- గుండె సంబంధింత వ్యాధులకు అమర్చే స్టెంటులు, ఐసీయూ, జనరల్ వార్డులో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుంది.
- రోగికి చికిత్స సమయంలో ఉచితంగా భోజనం అందిస్తారు.
- ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 15 రోజుల పాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయి.

నియోజకవర్గంలో 28వేల మందికి లబ్ధి..

70 ఏళ్లు నిండి, ఆధార్ కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకం కింద రూ.5 లక్షల హెల్త్ కవరేజీకి అర్హులు. ఆలూరు నియోజకవర్గంలోని 6 మండలాల్లో ఉన్న 11 పీహెచ్‌సీల పరిధిలో 28 వేల మంది 70 ఏళ్లు నిండిన వృద్ధులు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. వీరందరూ పీఎంజేఏవై పథకానికి అర్హులని చెబుతున్నారు. ఈ పథకం కింద ఇప్పటికే వైదారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారు. ప్రస్తుతం 70 ఏళ్లు నిండిన వృద్ధులు www.pmjay.in వెబ్‌సైటులో దరఖాస్తు చేసుకుని ఆయుష్మాన్ కార్డు పొందవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీఎంజేఏవై ఆరోగ్య బీమాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పేదలందరికీ ఈ పథకం కింద రూ. 5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోంది. వీరందరికీ ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి కార్డులు జారీ చేశాం. తాజాగా ఆర్థిక,ఆదాయ పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఈ పథకం వర్తింపజేస్తున్నారు. వీరికి కూడా రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేసుకునే వేసులుబాటును కేంద్రం కల్పించింది.

– రవి,డాక్టర్,మొలగవల్లి పీహెచ్‌సీ,

మహాధర్నాను జయప్రదం చేయండి

ఆస్పరి: ఈనెల 26వ తేదీన ఆదోనిలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలకృష్ణ, కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు సాగిస్తామన్నారు. నాయకులు బ్రహ్మయ్య, రామాంజనేయులు, హనుమంతు, గోపాల్, రామకృష్ణ, రంగన్న పాల్గొన్నారు.

ఆలూరు: కనీస వేతనచట్టాన్ని అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి ఆశా వర్కర్లు, సివిల్ సప్లయీస్ గోదాము హమాలీ సంఘం నాయకులు తరలిరావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక సీఐటీయూ కార్యాలయ ఆవరణలో ఆశా వర్కర్లు, వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

పాదయాత్రకు తరలిరండి

వెల్దుర్తి(కృష్ణగిరి): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా గ్రామాభివృద్ధి కోసం వెల్దుర్తిలోని అయ్యప్ప దేవాలయం నుంచి బ్రహ్మగుండం వరకు చేపట్టే పాదయాత్రకు తరలిరావాలని అయ్యప్ప స్వామి భక్తులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. పాదయాత్రలో పాల్గొనే వారు బియ్యం, బ్యాల్లు, నూతన వస్త్రంతో రావాలని సూచించారు. ఉదయం ఏడున్నర గంటలకు దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

ఓటరు నమోదుకు 187 దరఖాస్తులు


ఎడవలిలో వయస్సు నిర్ధారణ పత్రాలను పరిశీలిస్తున్న బీఎల్ఓ

తుగ్గలి : రెండు రోజులుగా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న ఓటరు ప్రత్యేక క్యాంపుల్లో కొత్తగా ఓటరు నమోదుకు మొత్తం 187 దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శని, ఆదివారాల్లో 257 పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. వీఆర్వోలు, బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించారు. కొత్త ఓటు నమోదుకు 187 దరఖాస్తులు, తొలగింపునకు 34, సవరణలకు 94 దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మద్దికెర : మండలంలోని హంప, ఎడవలి గ్రామాల్లో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ ఆదివారం పరిశీలించారు. వీఆర్వోలు రషీద్, రామాంజులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి


హొళగుంద: 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని తహసీల్ద్రార్ సతీష్ అన్నారు. ఆదివారం హొళగుందతో పాటు సుకువాయి తదితర గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఆయా పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు ఓటరు జాబితాల్లో పేరు నమోదు కోసం గ్రామస్తుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు.

ఓటరు నమోదుకు 37 దరఖాస్తులు

కృష్ణగిరి: మండలంలో ఓటర్ నమోదుకు 37 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. మండల వ్యాప్తంగా రెండు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో ఓటర్ నమోదు, తొలగింపు, మార్పులకు సంబంధించి 37 దరఖాస్తులు రాగా వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

హొళగుంద: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మదనపల్లిలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అన్ని తహసీల్దార్ కార్యలయాల్లో సీసీ కెమోరాలతో నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం సాయంత్రం కెమెరాలు అమర్చారు. వాటి విజువల్స్ నిక్షిప్తం చేసేందుకు మానిటర్, ఇతర పరికరాలను తహసీల్దారు చాంబర్‌లో ఏర్పాటు చేశారు.



హొళగుంద తహసీల్దారు కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

లీకేజీ.. పట్టించుకోరేమీ?

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో కొన్ని నెలల క్రితం మంచినీటి పైపులైన్ లీకేజీ ప్రారంభమైంది. అప్పటి నుంచి నీరు వృథాగా పారడమే కాకుండా నీరు కలుషితమవుతోంది. అయినా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ కారణంగా గ్రామంలో నీటి ఎద్దడి నెలకొందని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయించి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


పైప్‌లైన్ లీకై పారుతున్న నీరు


కార్తీక వనసమారాధనలో పాల్గొన్న కమ్మ సంఘం నాయకులు


ఆలూరులో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

అహ్లాదం..ఆధ్యాత్మికం

- సందడిగా వన సమారాధనలు

పత్తికొండ(తుగ్గలి) : కార్తీక మాసం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమాలు అహ్లాదకరంగా జరిగాయి. పత్తికొండలోని రమ్య రిసార్ట్‌లో కమ్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు (హైదరాబాద్) జెట్టి కుసుమ కుమార్, వైకుంఠం గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత వైకుంఠం మల్లికార్జునచౌదరి, మద్దికెర జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తంచౌదరి, సత్యసాయి సేవా సమితి సభ్యులు పారా రామచంద్రప్రసాద్, మాజీ సర్పంచ్ మనోహరచౌదరి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన కమ్మ కుటుంబ సభ్యులు ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చిన్నారులు, యువకులు, పెద్దలు, మహిళలు ఆడి పాడి సందడి చేశారు. సంఘం నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేలూరు రామప్ప, జరగల రాంబాబు, ట్రెజర్ వైకుంఠ ప్రతాప్, సంఘం నాయకులు వెంకటరాముడు, జరగల రవి పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో..

మండగిరి రామలింగేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామచంద్రయ్య, మద్దికెర, పత్తికొండ మాజీ సర్పంచ్‌లు కొత్తపేట వెంకటేశ్వర రెడ్డి, సోమశేఖర్ తదితరులు వ్యవసాయం రంగం, రైతు సమస్యలపై ప్రసంగించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకునేందుకు రైతులంతా ఐక్యం కావాలని వారు పిలుపునిచ్చారు.


పత్తికొండలో మాట్లాడుతున్న రామచంద్రయ్య


వనసమారాధనలో బ్రాహ్మణ సంఘం పెద్దలు

అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రాజాసాహెబ్, ఉమాపతి, సురేంద్ర, పెద్ద తిమ్మయ్య, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకుల ఎస్టీ జాబితాను పునరుద్ధరించాలి

ఆలూరు: వాల్మీకుల ఎస్టీ జాబితా పునరుద్ధరణకు కృషి చేస్తామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చిన చంద్రబాబు నాయుడు తన హామీని నిలబెట్టుకొని చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పేర్కొన్నారు. మండల కేంద్రం సమీపంలో నున్న శ్రీబెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో వీఆర్పీఎస్ జిల్లా యువజన అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ ఆధ్వర్యంలో ఆదివారం వాల్మీకి కులస్తుల కార్తీక వనభోజనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ క్రాంతినాయుడు, ఆలూరు నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షుడు డి.నాగేష్, రాష్ట్ర నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


మద్దికెరలో గీతాలు ఆలపిస్తున్న అయ్యప్ప, భవానీ, శివ మాలధారులు


వన భోజనం చేస్తున్న మాలధారులు

మద్దికెర : స్థానిక విరూపాక్ష దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం అయ్యప్ప మాలధారులు అధ్యాతిక పూజలు నిర్వహించి కార్తీక వన భోజనం చేశారు. ముందుగా దేవాలయంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప. భవానీ, శివ స్వామి వారి గీతాలు పాడారు. అనంతరం ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. మాలధారులకు, పూజలకు విచ్చేసిన భక్తులకు దాతలు అన్నదానం చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజన్న ఈరన్న గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, కేశన్న ,రామాంజులు పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : పట్టణ శివారులోని శ్రీ నరసింహస్వామి తోటలో ఆదివారం శ్రీ గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంఘం పెద్దలు ఏపీఎన్ విశ్వం, శ్రీనివాసశర్మ, నాగరాజ రావు, వసంతకుమార్, వనం విజయ స్వామి,వెంకటరమణ, మురళీస్వామి, ప్రభాకర్ పాల్గొన్నారు.

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలి

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ ఆదాయ, వ్యయాలు, ఇంటి పన్ను వసూళ్లకు సంబంధించిన వివరాలు స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో పొందుపరచాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి సూచించారు. ఆదివారం స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెరవలి, బసినేపల్లి ఆన్‌లైన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పంచాయతీలకు సంబంధించిన సమగ్ర వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సర్వే వల్ల కావలసిన వనరులు సమకూర్చి గ్రామాలను వేగంగా అభివృద్ధి చేయడానికి వీలవుతుందన్నారు. ఈఓ పరమేష్ పాల్గొన్నారు.

ముందస్తు పరీక్ష.. క్యాన్సర్ నుంచి రక్షణ

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ పరీక్షలు
- ఇంటింటికీ తిరిగి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది
- వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు
- ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభమంటున్న నిపుణులు

మద్దికెర : ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌నుంచి రక్షణ పొందవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ పై విజయం- స్క్రీనింగ్‌తో సాధ్యం అనే నినాదంతో కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. పరీక్షల్లో వెల్లడైన వివరాలను, సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యే యాప్ రూపొందించింది. శిక్షణ ఇచ్చిన అధికారులు సర్వేను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య శాఖ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల అధిక మరణాలు చోటు చేసుకుంటున్నాయని వెల్లడైంది. దీంతో క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే నిర్ధారణ పరీక్షలతో సాధ్యమని గ్రహించారు. ప్రాథమిక దశలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం వల్ల మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని తేల్చారు.


మద్దికెరలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

క్యాన్సర్ స్క్రీనింగ్ విధానం ..

ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ విధానం అని పిలుస్తారు. క్యాన్సర్ నివారణ, ముందస్తు రోగ నిర్ధారణకు మెరుగైన ఫలితాల కోసం క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు ఉపయోగపడతాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

సర్వే ఇలా..

క్యాన్సర్ పరీక్షలు కోసం ఇంటింటికీ వెళ్లి 18 సంవత్సరాలు నిండిన మహిళల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తారు. వీటితో దంత పరీక్షలు సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ఈనెల చివరి వరకు స్క్రీనింగ్ కొనసాగుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. రోజులో ఐదు ఇళ్ల, వారంలో 5 రోజులు పరీక్షలు చేస్తున్నారు. నియోజకవర్గంలో మద్దికెర, కృష్ణగిరి, వెల్దుర్తి, పత్తికొండ, తుగ్గలి మండలాల్లో పరీక్షలు ముమ్మరంగా సాగుతున్నాయి


మద్దికెరలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలకు ఉపయోగం



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయడం వల్ల ముందుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. మహిళలు ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లతో బాధపడుతున్నారు. ఈ పరీక్షలతో సత్ఫాలితాలను పొందవచ్చు. నవంబర్ నెల నుంచి మరో ఆరు నెలల వరకు ఇంటింటికీ తిరిగి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రాగిణి, మద్దికెర


ఏరూరు గ్రామం మధ్యలో ఉన్న మురుగు నీటి కుంట

చెరువు కాదండోయ్!

చిప్పగిరి: సాధారణంగా మురుగు నీటి కుంటలు గ్రామం వెలుపల ఉంటాయి. కానీ మండలంలోని ఏరూరు గ్రామంలో గ్రామ నడి బొడ్డున ఉండటంతో మురుగు నీటి కంపు, దోమల బెడద తీవ్రమై గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పలు కాలనీల్లో నుంచి వచ్చే మురుగు నీరు ప్రధాన రహదారి గుండా ఈ కుంటలోకి చేరుతాయి. అలాగే.. వర్షం నీరు కూడా ఇందులోకి చేరి నిల్వ ఉంటుండటంతో నిత్యం నిండుగా చెరువును తలపిస్తోంది. గ్రామంలో 1642 మంది ఓటర్లు ఉండగా 2,200 వరకు జనాభా ఉంది. మురుగు కారణంగా దోమలు, ఈగలు వేధిస్తున్నాయని, రోగాలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. మురుగు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకొని కుంటను పూడ్చి వేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.